## క్లుప్తంగా

### వడ్డేశ్వరంలో తాగునీటి సరఫరా



**తాడేపల్లి రూరల్:** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో పాత పైపులైన్లు తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తుండడంతో శనివారం ఆ ప్రాంతానికి అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. రెండు, మూడు రోజుల్లో పైపులైన్ల నిర్మాణ పనులు పూర్తవుతాయని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి తెలిపారు.

### ఉర్దూ బోధనలో శ్రద్ధ అవసరం



**ఫిరంగిపురం:** మండలంలోని మేరికపూడి మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను డీఐ ఎండీ. ఖాసిం శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ పుస్తకాలు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి, వారితో బోర్డుపై పలు అంశాలు రాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఉర్దూ భాష చక్కగా చదవడం, రాయడంపై ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఎఫ్ ఏ-4 మార్కులను ఈనెల 22లోపు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఆధార్ , బ్యాంకు వివరాలు పొందుపర్చాలని తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయులు నాగుల్‌మీరా, స్వప్న ఉన్నారు.

### మిర్చి రైతులు జాగ్రత్తలు పాటించాలి

**ఫిరంగిపురం:** మిర్చి రైతులంతా కల్లాల్లో కాయలకు వర్షాల వల్ల నష్టం కలగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఏవో రమణకుమార్ సూచించారు. కాయలు తడవకుండా పైన టార్పాలిన్ పట్టాలు కప్పాలని తెలిపారు. అధిక తేమ వల్ల చెట్టు మీద కాయలకు కుళ్లు రావడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మాంకోజెట్ (లీటర్‌కు 2.5 గ్రాముల) లేదా క్లోరోథలోనిల్ (లీటర్‌కు 2 గ్రాములు) లేదా థయోఫినైట్ మిథైల్ (లీటర్‌కి 2 గ్రాములు) కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తెగులు ఉధృతి నివారించడానికి డైఫిన్ కొనజోల్ (0.5) మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. పిచికారి చేసిన తరువాత కాబ్రియోటాప్ లీటర్‌కు 3 గ్రాములు జల్లుకోవాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**తాడేపల్లి రూరల్:** కనకదుర్గ వారధిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తాడేపల్లి యస్ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం... తాడేపల్లికి చెందిన బొమ్మిశెట్టి హరికిరణ్ స్నేహితులతో కలసి కారులో కనకదుర్గ వారధిపై విజయవాడ వెళుతుండగా వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో కారు నడిపే వ్యక్తితో పాటు ముందు సీట్లో ఒకరు, వెనుక సీట్లో బొమ్మిశెట్టి హరికిరణ్ కూర్చుని ఉన్నారు. ప్రమాదంలో ఆయన ఎడమ చేయి విరిగింది. హరికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ వినోద్ తెలిపారు.

# డోకిపర్రులో మంచినీటి చెరువుకు గండి

**ప్రజా ప్రతినిధులు అప్రమత్తమై పూడ్చివేత**

**మేడికొండూరు:** మండలంలోని మేజరు పంచాయతీ డోకిపర్రు రక్షిత మంచినీటి చెరువుకు శనివారు తెల్లవారుజామున గండి పడింది. నీరు ఒక్కసారిగా తురకపాలెంలోని ఇళ్లలోకి ప్రవేశించడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయాన్ని స్థానిక నాయకులు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎస్ఐ కోటేశ్వరరావుతో పాటు వైఎస్సార్ సీపీ నేతల దృష్టికి తీసుకు రావడంతో వారు వెంటనే అప్రమత్తమయ్యారు. జేసీబీ క్రేన్‌ను తీసుకువచ్చి గండిని పూడ్చేయడంతో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని పలువురు అధికారులు శనివారం గండిపడిన చెరువు కట్టను పరిశీలించారు. భవిష్యత్‌లో సంఘటన పునరావృతం కాకుండా కట్టలకు పటిష్ట భద్రతకు చర్యలకు ప్రణాళికలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శోభారాణి , పీఆర్ ఏఈ వరప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



పనులు చేయిస్తున్న జెడ్పీటీసీ సిద్ధయ్య తదితరులు

# రక్త క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

**తాడేపల్లి రూరల్ :** వడ్డేశ్వరం కె.ఎల్. విశ్వవిద్యాలయంలో రక్త క్యాన్సర్‌పై శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక వ్యక్తి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని తెలిపారు. బ్లడ్ డిజార్డర్స్, లైఫ్ సేవర్స్ అవసరాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని చెప్పారు. రిక్రూట్‌మెంట్ డోనర్, డెప్యూటీ మేనేజర్ ప్రజీత్ సుధాకర్, అసోసియేట్ డోనర్ రిక్రూట్‌మెంట్ అషిత, జె. కృత్తికలు ముఖ్య అతిథులుగా హాజరై, విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు విద్యార్థులు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని ఇవ్వడానికి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ ఎ. జగదీష్, సీఎస్ఆర్ విశ్రాంత శాస్త్రవేత్త బాపూజీ, హబీ క్లబ్ అధ్యాపకులు డాక్టర్ శుభాకర్ రాజు, సాక్ డైరెక్టర్ పి. విజయ్‌సాయి, డాక్టర్ బుచ్చి, ఫార్మసీ విభాగ అధ్యాపకులు డాక్టర్ కె. సుకీర్తి, డాక్టర్ పి. లోకేశ్వరి, డాక్టర్ నరేష్, సేఫ్ లైఫ్ సభ్యులు వెంకట్ కళ్యాణ్, మహమ్మద్ నూర్, మహాలక్ష్మి పాల్గొన్నారు.



క్యాన్సర్ బాధితులకు రక్తం ఇవ్వడానికి పేర్లు నమోదు చేయించుకుంటున్న విద్యార్థులు

# క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్స్ పంపిణీ

**తాడేపల్లి రూరల్:** మంగళగిరి గణపతినగర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శనివారం ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎంఒడీటీసీ డాక్టర్ బి. లక్ష్మణ్ నాయక్ ఆదేశాల మేరకు క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర టీబీ కంట్రోలర్ ఆఫీసర్ డాక్టర్ టి. రమేష్ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పోషకాహారం తీసుకోవడం ద్వారా త్వరగా కోలుకుంటారని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అంగ్ టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ బందారు సుబ్బారావు మాట్లాడుతూ 2125 మంది మందులు వాడుతున్నారని తెలిపారు. ఇందులో 1200 మంది రోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అమరావతి సర్కిల్ కనెక్ట్ - టు - ఆంధ్ర ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రోత్సాహంతో ఆరు నెలల పాటు పోషకాహారం అందించేందుకు అంగీకరించిందని వివరించారు. అనంతరం రోగులకు పోషకాహార కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళగిరి ఏరియా రీజనల్ మేనేజర్ పి. ఈశ్వరరావు, హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి పి. అనూష, టీబీ యూనిట్ వైద్యాధికారి కిరణ్ కుమార్, జిల్లా టీబీ విభాగం పీపీఎం వి. రాజశేఖర్, డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ డి. జోసఫ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



కిట్స్ పంపిణీ చేస్తున్న రాష్ట్ర టీబీ కంట్రోలర్ ఆఫీసర్ రమేష్

# శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్. విశ్వవిద్యాలయంలో విజయవాడకు చెందిన బిలీఫ్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో శనివారం కూడా ఉచిత కాలేయ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ శరీరంలో ముఖ్యమైన అవయవం కాలేయం అని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. మాంసాహారం అధికంగా తీసుకోవడంతో పాటు మద్య, ధూమపానాల వంటి అలవాట్ల వల్ల కాలేయం దెబ్బ తింటుందని వివరించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ శిబిరంలో సుమారు 500 మంది అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, భవన నిర్మాణ కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ ఎ. జగదీష్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ పి. శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల అధిపతి డాక్టర్ సింథెల్ మురుగన్, సాక్ డైరెక్టర్ పి. విజయ్ సాయి, అసోసియేట్ డీన్ డాక్టర్ కె. రూతు రమ్య, సమన్వయకర్తలు పి. సురేష్, జి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కాలేయ పరీక్షలు నిర్వహిస్తున్న బిలీఫ్ ఆసుపత్రి వైద్య నిపుణులు

# 5న రైతు సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా

**తాడేపల్లి రూరల్:** ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం దుగ్గిరాల మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. సెంట్రల్ వేర్ హౌస్ ముఠా కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ పంచాయతీ కార్మికులకు కనీస వేతం అమలు చేయాలని, ముఠా కార్మికులకు సంక్షేమ సంఘం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం 600 రూపాయలు ఇచ్చి, కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, ఏపీ రైతు సంఘం నాయకులు వి. సాంబశివరావు, ఉపాధి హామీ కార్మికులు మల్లేశ్వరి, కుమారి, రాజమ్మ, లక్ష్మీ తిరుపతమ్మ, ముఠా కార్మికుల మేస్త్రి రత్తయ్య, గ్రామ పంచాయతీ కార్మికులు కె. వెంకటేశ్వర్లు, నరసింహం, సాంబనాయక్, దీనకుమారి పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు

# రేపటి నుంచి నవరాత్రి మహోత్సవాలు

**తెనాలి రూరల్:** పెదరావూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యపురం మహావిద్యాపీఠంలో గల అభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో ఈ నెల 20వ తేదీ నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. 21 నుంచి 31వ తేదీ వరకు ప్రతి రోజు మహాత్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి త్రికాల పీఠార్చనలు, విశేష పూజ, హోమాలు, వేద సభలు జరుగనున్నాయి. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు సుబ్రహ్మణ్యపురంలోనే ఉండి ప్రతి రోజు భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తారు. ఉగాది రోజున ప్రత్యేక దర్శనం, అనుగ్రహ భాషనం ఉంటుంది. 30వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా సీతారామ దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 31వ తేదీ శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుంది. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అన్న సంతర్పణ జరుగుతుందని విద్యాపీఠం కార్యవర్గ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ముస్లింల సంక్షేమం, అభ్యున్నతికి సీఎం కృషి



**తాడేపల్లి రూరల్ :** రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని తెలిపారు. దుగ్గిరాలలోని అంజుమన్ షాదీఖానాలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-2024 వార్షిక బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రూ. 4203 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది రూ. 3554 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ. 650 కోట్లు పెంచిందని తెలిపారు. మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. సమావేశంలో మైనార్టీ నాయకులు షేక్ జానీ సాహెబ్, షేక్ హుసేన్ సాహెబ్, షేక్ జిలాని, సయ్యద్ జాని పాల్గొన్నారు.

### నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**తెనాలి అర్బన్:** నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడే లెఫ్ట్ పార్టీలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాల స్వేచ్ఛను జీవో నంబరు 1 హరిస్తోందని ఆరోపించారు. దానిపై ప్రభుత్వం పునరాలోచన చేసి రద్దు చేయాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ మాట్లాడుతూ భగత్‌సింగ్ విగ్రహాల చుట్టూ ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ కార్యదర్శి పల్నాటి నాగరాజు, ఏఐవైఎఫ్ నాయకులు మన్నం కొండ, బిళ్ల రాజేష్, కె.గోపి, కనూరి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ సినిమాల్లో ప్రబోధ గీతాలపై చర్చ

**తెనాలి:** పట్టణంలో నిర్వహిస్తున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో ఈ వారం ప్రదర్శించిన ఎన్టీఆర్ ఉచిత సినిమాలపై సమీక్ష, ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై చర్చ నిర్వహించారు. రంగస్థల కళాకారుడు, గాయకుడు వేమవరపు లక్ష్మీనరసింహారావును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వెంపటి సత్యనారాయణ, మహమ్మద్ ఖుద్దూస్ ఎన్టీఆర్ చిత్రాల్లోని ప్రబోధ గీతాలు అనే అంశంపై ప్రసంగించారు. కళాకారుడు లక్ష్మీనరసింహారావుతో పాటు వీరిద్దరిని సత్కరించారు. విష్ణు మొలకల భీమేశ్వరప్రసాద్, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, అప్పల కిశోర్, కొండముది రమేష్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా అన్నమాచార్యుల 520వ ఆరాధన



ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న బాల స్వామీజీ

**తెనాలి టౌన్:** తాళ్లపాక అన్నమాచార్యుల 520వ ఆరాధన మహోత్సవాలను పట్టణంలోని ఆశ్రమాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు ఆశ్రమం, గాంధీనగర్‌లోని షిర్డీ సాయి వృద్ధాశ్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి ఆదేశానుసారంగా శ్రీవిద్యా పీఠం నిర్వాహకులు బాలస్వామీజీ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. బాలస్వామీజీ మాట్లాడుతూ తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు అన్నమాచార్యులు 32 వేల కీర్తనలు రచించారన్నారు. కీర్తనలు, వాటి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సాలిగ్రామ మఠం ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం, తటవర్తి శివరామకృష్ణ, సువర్ణకుమారి, ఆశ్రమాల నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, భారతి, మురళి, సత్యనారాయణ పాల్గొన్నారు.

# అర్ధరాత్రి పంట పొలాల్లో దొంగలు

- గస్తీ కాసి పట్టుకున్న రైతులు
- పోలీసులకు అప్పగింత

**తాడేపల్లి రూరల్:** మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి పంట పొలాల్లో అర్ధరాత్రి అరటి గెలలను దొంగతం చేస్తున్న ఇద్దరు యువకుల్ని శనివారం తెల్లవారుజామున రైతులు పట్టుకుని తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. రెండు నెలల నుంచి పొలాల్లో అరటి గెలలు మాయమవ్వడంతో రైతులు రైతుల కాపాలా కాశారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో గుంటూరు చానల్ ఒడ్డున ఓ చేలో గెలలను నరికి స్కూటీపై తీసుకెళుతున్న ఇద్దరు యువకుల్ని పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. పట్టుకున్న ఇద్దరు యువకుల్ని శనివారం పోలీసులకు అప్పగించారు. కృష్ణలంకకు చెందిన చక్కా షణ్ముఖసాయి, పోరంకి వెంకట రమణగా పోలీసులు వారిని గుర్తించారు. పరారైన ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ రమేష్ తెలిపారు.



తెల్లవారుజామున దొంగతనం చేసిన అరటి గెలలు ఇవే

# ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలతో ప్రజలకు మెరుగైన వైద్యం

**ఫిరంగిపురం:** ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె.వి.సుబ్బరాజు తెలిపారు. మండలంలోని గొల్లపాలెంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది నుంచి ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేపూడి, ఫిరంగిపురం గ్రామాల్లోని వైద్య కేంద్రాల వద్ద వ్యాక్సినేషన్‌తో పాటు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ప్రతి బుధ, శనివారాల్లో ఆయా గ్రామాల్లోని ఆరోగ్య సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు మీజిల్స్, రుబెల్లా(ఎంఆర్) వ్యాక్సిన్ ఒకటి, రెండు డోసులు వేయాలని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు బృందాలుగా ఏర్పడి పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అనంతరం ఏఈఎఫ్ఐ కిట్లు, ఎంసీపీ కార్డులు పరిశీలించారు. నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ నిల్వ ఉంచే కోల్డు చైన్ బాక్సుల్ని తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారులు, సూపర్‌వైజర్ వి.ఎస్.ఆర్. శాస్త్రి ఉన్నారు.



ఆరోగ్య కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఐవో సుబ్బరాజు

# చిరు వ్యాపారికి తోపుడు బండి అందజేత

**తాడేపల్లి రూరల్:** మంగళగిరి రూరల్ పరిధిలోని పెదవడ్లపూడిలో చిరు వ్యాపారం చేసుకునే మహిళకు శనివారం విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తోపుడు బండిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షురాలు కాగితాల స్వాతి మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం ఈసీ మెంబర్ కోవెలకారు శివరాం బాబూజీ ఆర్థిక సహాయంతో తోపుడు బండిని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ట్రెజరర్ బొట్టేటి రమేష్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు మాధు నాగదుర్గ పాల్గొన్నారు.



బుజ్జమ్మకు తోపుడు బండిని అందజేస్తున్న విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ సభ్యులు

# సబ్‌పోస్టాఫీస్ ఆకస్మిక తనిఖీ

**తెనాలి:** ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్) జి.హరిప్రసాద్, శనివారం తన బృందంతో కలిసి పట్టణ మారీసుపేటలోగల సబ్‌పోస్టాఫీసులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పోస్టాఫీసు కార్యకలాపాలను నిశితంగా పరిశీలించారు. వ్యత్యాసాలుంటే గుర్తించడం, వ్యాపారాన్ని మెరుగయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలు, ఖాతాదారులను గుర్తించడం లక్ష్యంగా ఈ తనిఖీ కొనసాగింది. ఆర్థిక రికార్డులను సమీక్షించారు. రోజువారీ కార్యకలాపాలు, సవాళ్లపై అవగాహనకు పోస్టాఫీసు సిబ్బంది, కొందరు ఖాతాదారులతో సంభాషించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టల్ సర్వీసుల్లో పారదర్శకత, జవాబుదారీతనం అత్యున్నత ప్రమాణాలను నిర్ధారించడానికి తాము కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ఖాతాలు, లావాదేవీల స్థితిని సమీక్షించడానికి, సేవల మెరుగుకు బృంద తనిఖీ ఒక ముఖ్యమైన సాధనమన్నారు. లావాదేవీలకు సంబంధించి ఎస్ఎంఎస్ పొందడానికి, ఖాతాల్లో అవకతవకల నివారణకు ఖాతాదారులంతా తమ ప్రస్తుత ఖాతాలన్నింటిలో వారి మొబైల్ నంబరును అప్‌డేట్ చేయాలని సలహానిచ్చారు.



తనిఖీ చేస్తున్న హరిప్రసాద్, బృందం